స్కెచ్

# శాంతి తెచ్చిన అశాంతి

సరిపల్లి ద్వారకనాథ్

ప్రపంచాధిపత్యానికి కృషిచేస్తున్న అమెరికా, రష్యా దేశాలవల్ల మూడవ ప్రపంచ యుద్ధం సంభవించే ప్రమాదమున్నదని అందరూ భయపడుతున్న రోజులివి. రెండు దేశాలూ ఆయుధోత్పత్తిని అమితంగా పెంచేస్తున్నాయి. స్వల్ప ప్రమాదం కలుగజేసే చిన్న తూటా మొదలు ఒక్క క్షణాలలో, ఒక్క ప్రయోగంతో సర్వం నాశనం చేసే మహా మారణాయుధాలవరకూ అస్త్రాలు సృష్టింపబడుతున్నాయి. నిజంగా యీ సారి ప్రపంచ యుద్ధమంటూ వస్తే సమస్త జీవకోటి తుడిచి పెట్టుకపోతుంది. అదిమాత్రం నిజం. రెండు దేశాల పరస్పర విద్వేషంవల్ల ప్రాణికోటియావత్తూ నశింపవలసినదేనా? ఇక గత్యంతరం లేదా?

ఉన్నది!

ప్రపంచానికి రానున్న యీ మహా ప్రళయాన్ని అరికట్టు నిమిత్తమే అంగలూరుకు ఆరు మైళ్ళ దూరానవున్న అవనిగడ్డ గ్రామంలో యీ మధ్య ఒక మహాసభ యేర్పాటు చేయబడ్డది. ఈ సభ ముఖ్యోద్దేశం "శాంతి కావా"లంటూ ఒక తీర్మానం ప్రతిపాదించి, సభవారి అంగీకారం పొందినపిదప, యుద్ధ ప్రయత్నాలు మానవలసినదని అగ్రరాజ్యాలలో అగ్రమైనవైన అమెరికా, రష్యాలకు విజ్ఞప్తి చేయడం.

నిర్ణయింపబడిన ప్రకారం రాత్రి తొమ్మిది గంటలకు, మసకమసక వెన్నెల కాస్తుండగా అవనిగడ్డ గ్రామస్థులు ఒక్కొక్కరే ఊరివెలుపల మఱ్ఱిక్రింద సమావేశమైనారు. అయితే "సాంప్రదాయం ప్రకారం" అందరూ సభకు హాజరు కాలేదు. వెర్రికాని అంతమాత్రాన సభ ఆగిపోతుందా? గ్రామస్థుల కోర్కెపై గ్రామ పెద్దలలో ఒకడైన నాంచారయ్య సభకు అధ్యక్షత వహించి, యుద్ధ ప్రమాదాన్ని, వర్తమానంలో శాంతియొక్క అవసరాన్ని గురించి చాలసేపు ముచ్చటించాడు. తరువాత కొంతమంది సభికులు వేసిన ప్రశ్నలకు తగు రీతిని సమాధానం యిచ్చాడు. ఇక "శాంతి తీర్మానాన్ని" ప్రవేశపెట్టి సభికుల అనుమతి పొందటమే తరువాయి.

సరిగ్గా యీ సమయానికే అంగలూరు వెళ్ళిన వరదయ్య (ఈయన అవనిగడ్డలో ఒక మోతుబరి; చదువ నేర్చినవాడు) గ్రామానికి తిరిగి వస్తూ, రాత్రివేళ ఊరి వెలుపల సమావేశమైన ఈ సభయొక్క వైనం యేమిటా అని పరికించడం సంభవించింది. పరికిస్తే అసలు విషయం తెలిసింది. తెలియగానే వరదయ్యకు అమాంతంగా పొట్ట పగిలేటట్టు నవ్వువచ్చి అక్కడ చతికిల బడ్డాడు.

ఇంతలో నాంచారయ్య "శాంతి తీర్మానం" ప్రతిపాదించి, ఎవరికైనా అభ్యంతరాలుంటే తెలియ జేయవలసిందన్నాడు. వర్తమానంలో శాంతి అత్యవసరమనీ, యుద్ధం రాకుండా అగ్రరాజ్యాలైన అమెరికా, రష్యాలు చూడవలసినదని అవనిగడ్డ గ్రామస్థులు విజ్ఞప్తి చేయడమైనదనీ ఆ తీర్మానంలో పేర్కొనబడింది. ఒక్క నిముషం అంతా నిశ్శబ్దం. ఎవరూ మాటాడలేదు. అందరి ముఖాలలోనూ శాంతి కావాలన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఎవరూ శంక వెలిబుచ్చలేదు. తీర్మానం బలపడిందని నాంచారయ్య సంతోషిస్తూ "అయితే యీ తీర్మానం నెగ్గినదన్న మాట!" అన్నాడు సభికుల నుద్దేశించి.

వెంటనే తూటావలె లేచి వరదయ్య అన్నాడు: "అర్థం పర్థంలేని యీ తీర్మానం నెగ్గడమేమిటీ, దీనివల్ల రాబోయే యుద్ధం ఆగడమేమిటీ, మీకేమైన మతులున్నాయా? చేతకాని సన్యాసులు మీరు యుద్ధం వద్దంటే వినిపించుకునేదెవరూ అంట? అవనిగడ్డ యెక్కడ, అమెరికా ఎక్కడ? అసలీ తీర్మానం వాళ్ళకి చేరుతుందా అంట!

అర్థరాత్రి పొల్లు కబుర్లు చెప్పక యిళ్ళకుపోయి పడుకోండి, నిద్ర దండుగ!"

నాంచారయ్యకు తెగ కోపం వచ్చింది. మిగతా వారంతా బలపరిస్తే తీర్మానాన్ని యీ విధంగా వరదయ్య అవమానపరుస్తాడా? శాంతిని స్థాపించ వలసిందని అటు ట్రూమన్‌ని, యిటు స్టాలిన్‌ని వేడుకోవడంకోసం అవనిగడ్డలో అర్థరాత్రి సభ చేయడం తప్పా? పైగా వరదయ్య నానామాటలూ అంటాడా?

వెంటనే వరదయ్యవేపు చూసి నాంచారయ్య అన్నాడు, "వరదయ్యా! సభా మర్యాద తెలుసుకోకుండా, నోటికి వచ్చినట్టు "శాంతి తీర్మానాన్ని" అవమానం చేస్తున్నావ్! నీకు శాంతి అవసరం లేదూ? మహాభయంకరమైన, విపత్కరమైన, సర్వనాశనకరమైనయుద్ధాన్ని నీవు వాంఛిస్తున్నావా?"

"లేదు,మనస్ఫూర్తిగా నేను శాంతిని కాంక్షిస్తున్నా" వరదయ్య జవాబిచ్చేడు.

"శాంతి కావాలంటూ, శాంతి తీర్మానాన్ని ఎదుర్కోవడం అవివేకంకాదూ?"నాంచారయ్య ప్రశ్న వేసాడు.

వరదయ్య అందుకున్నాడు. "నా తీర్మానాలనూ, నీ తీర్మానాలనూ లక్ష్యపెట్టేదెవరూ అంట! ఇటువంటి తీర్మానాలవల్ల యుద్ధం ఆగుతుందా? ఇంతకంటే మంచిమార్గం చూడండి."

నాంచారయ్య "ఈ తీర్మానమే మంచి మార్గం!" అన్నాడు. వరదయ్య "తీర్మానాలకు చింతకాయలు కూడా రాలవు కనీసం" అని ఎదురు దెబ్బతీశాడు. నాంచారయ్యకు పౌరుషం వచ్చింది. వరదయ్యకూడా అంతకంటే తక్కువ తినలేదు. ఇద్దరు పెద్దలూ వాదనలో పడి, వాగ్యుద్ధ పరికరాలైన యుక్తి, బుకాయింపు, ఛలోక్తులను ప్రయోగిస్తూ రెండు గంటలసేపు కిందా మీదా పడ్డారు.

చివరకు అలసి, సొలసి, విసిగిన వరదయ్య అన్నాడు, "నాంచారయ్య పెట్టిన తీర్మానం వట్టి చవటది. నా సలహా యేమిటంటే..."

వరదయ్య వాక్యం ముగించకుండానే నాంచారయ్య ఛర్రుమని "చవటలూ, దద్దమ్మలూ మాకు సలహానివ్వనక్కర్లేదు." అన్నాడు కఠినంగా.

వరదయ్య లేచి "ఎవరోయ్ చవటలు నువ్వా, నేనా? చేసింది తెలివితక్కువ పనని అంగీకరించవోయ్ దద్దమ్మా!"

నాంచారయ్య: "నోర్మూయ్!"

వరదయ్య: "అట్టే వాగకు!"

ఇద్దరూ ఎదురు ప్రశ్నలూ, తిరుగు జవాబులు యిచ్చుకున్నారు. కొద్ది కాలంలో యిలా అవుతుందని ఎవరూ అనుకోలేదు. వాగ్యుద్ధంవల్ల సమాధానం దొరకక యిద్దరూ చేతులు కలుపుకున్నారు. ఇద్దరూ పెద్ద మోతుబరులు కాబట్టి సభలోని నాంచారయ్య ఆశ్రితులు అతనిపక్షమూ, వరదయ్య అనుకూలురు అతనిపక్షమూ కింద రెండు జట్లుగా తెగిపోయారు. దభీదభీమంటూ, ఫెడీ ఫెడీ మంటూ ఎవరు ఎవరైందో కూడా తెలియకుండా ఆ మసక వెన్నెట్లో అందరూ కుమ్ముకోడం, కొట్టుకోడం ప్రారంభించారు. ఈ కొట్లాట ఫలితంగా అంతవరకూ నోటిలో పళ్ళున్న కొంతమంది బోసి నోటివారైనారు. రెండు కాళ్ళవారు కొద్దిమంది ఒంటి కాలివారైనారు. మరి కొంతమంది యేకాక్షులైనారు. తల పగిలినవారు కొంతమంది; పోయిన ప్రాణం కలవారు మరి కొంతమంది!

అవనిగడ్డకు సమీపానవున్న అనేక గ్రామాలలో ఆ అర్థరాత్రి, అదే సమయానికి యేవో లీలగా మూలుగులు, కేకలు వినవచ్చాయి ప్రశాంతతను భంగపరుస్తూ!

* * *

వారం రోజుల అనంతరం ఒక దిన పత్రికలో ఐదవ పేజీలో, ఆరవ కాలంలో యీ దిగువ వార్త ప్రకటింపబడ్డది.

(మా ప్రత్యేక విలేఖరి)

అవనిగడ్డ: 15-3-52—శాంతిని కాపాడవలసినదంటూ అగ్రరాజ్యాలైన అమెరికా, రష్యాలకు విజ్ఞప్తి చేయడంకోసం, ఇచట రాత్రి సమావేశమైన శాంతి కాముకుల సభలో కలిగిన ఒక భిన్నాభిప్రాయం ఫలితంగా సభలో రెండు కక్షలు యేర్పడి చిన్న ఘర్షణ జరిగింది. ఫలితంగా పదిమందికి స్వల్ప గాయాలుమాత్రం తగిలినవి. పరిస్థితి మరునాడు పోలీసువారిచే అదుపులోనికి తేబడినవి. ఇన్స్పెక్టర్ లావణ్యంగారు దర్యాప్తు చేస్తున్నారు."

(కేవలం కల్పితం)